# నిశ్శబ్దంతో యుద్ధం

-నూతలపాటి వెంకటరత్నశర్మ

మనిషికెప్పుడో ఒకప్పుడు కష్టకాలం వస్తుందని తెలుసు కాని, అది ఇప్పుడొస్తుందని ఏనాడు అనుకోలేదు. కాలం ఇంత నిర్లిప్తంగా గడపడం చాలా కష్టంగా ఉంది. ఎప్పుడూ ఎంత 'బిజీ'గా ఉండేవాడు తను. ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం ఐదుగంటల వరకు ఆఫీసు పనులతో సతమతమై సాయంత్రానికి భార్యతో, కొడుకుతో విశ్రాంతిగా గడపటం నిత్యకృత్యం. కాస్త సమయం దొరికితే 'ఫ్రండ్స్'తోనో మార్కెట్ పనులతోనో 'బిజీ'గా మారిపోయేవాడు. సమయం ఎప్పుడూ భారంగా అనిపించేది కాదు.

ఇప్పుడు రెక్కలు తెగిన పక్షిలా మంచంలో – గత స్మృతులను నెమరు వేసుకుంటూ 'టి.వి'నే రెండో మనిషిగా కాలం గడుస్తుందని ఏనాడైనా అనుకొన్నాడా! 'అంతా విధి లిఖితం!' ఆలోచనలతో భృకుటి ముడి పడింది రాజారావుకి.

"మామయ్యగారు! ఈ బాక్సులో అన్నం. ఈ గిన్నెలో మజ్జిగ, కూర ఇక్కడ పెడ్తున్నా. వేళకు తినండి. సాయంత్రం వచ్చే సరికి కాస్త లేటు కావచ్చు. కూరల కోసం మార్కెట్‌కి వెళ్ళిరావాలి' అని హడావిడిగా రెండు మాటలు మాట్లాడి కోడలు బయటకు వెళ్ళడంతో ఆలోచనలు నుండి ఈ లోకంలోకి వచ్చాడు రాజారావు.

రాజారావుకి ఒక్క కొడుకు. ప్రభుత్వ రంగ సంస్థలో పనిచేస్తున్నాడు. కోడలు 'సుమతి' 'ప్రైవేటు' జాబ్ చేస్తోంది. ఇంకా పిల్లలు మాత్రం లేరు వాళ్ళకి.

ఈ మధ్యనే రాజారావు భార్య మరణించింది. అప్పటి నుండి రాజారావుకి కష్టాలు మొదలయ్యాయి. భార్యాభర్తలు ఇద్దరు ఉన్నంతవరకు ఒకరికొకరు చేయూతతో బాగానే ఉంది. ఎటొచ్చి భార్య చనిపోవ డం, తను 'పెరలసిస్' కారణంగా మంచాన పడడం, జరిగిన తర్వాత అసలైన యాతన మొదలైనట్లుంది.

రిటైరైన కొత్తల్లో తనకు 'టైం' గడిచేదికాదు. ఏమీతోచక కాలుగాలిన పిల్లిలా ఆ గదిలో నుండి ఈ గదిలోకి తిరుగుతూ ఉండడం, ఆడవాళ్ల పనుల్లో వ్రేలు పెట్టడం. అది బాగాలేదు, ఇది బాగా లేదంటూ నస పెట్టడం చూసి భార్య విసుక్కునేది. దాంతో క్రమంగా వాటన్నింటికి స్వస్తిచెప్పి 'టి.వి'కి కళ్ళప్పగించి కూర్చోవడం అలవాటు చేసుకున్నాడు.

భార్య మరణం తర్వాత జీవితంలో పూర్తి శూన్యం ఏర్పడింది. ఉన్న ఒక్కగానొక్క కొడుకు ఉద్యోగంతో మూడొంతులు బయటే గడుపుతాడు. కోడలు కూడా ప్రైవేట్ 'జాబ్' పుణ్యమాని 'బిజీ' అయిపోయింది. తనతో నోరు విప్పి మాట్లాడేవారే కరువయ్యారు. ఈ నిశ్శబ్దాన్ని రాజారావు భరించలేకపోయేవాడు. ఒక్కోసారి తన స్నేహితులతో ఎవరితోనైనా ఆ మాటే అంటే అదేమంత పెద్ద సమస్య కాదన్నట్టు తేలిగ్గా కొట్టి పారేసేవాడు. ఇప్పుడయితే మరీ కష్టంగా ఉంది. ఎక్కడికి నాలుగడుగులు వేయలేని దుస్థితికితోడు గుప్పెడు మందులు మింగడం, వేళకు నాలుగు మెతుకులు తినడం, మెలుకువ ఉన్నంతసేపు టివి చూడడం మినహా గత్యంతరం లేదు.

మనిషి సంఘజీవి అంటారు. మంచికైనా చెడు కైనా నలుగురు కావాలంటారు. అట్లాంటిది అసలు మాట్లాడే మనిషే లేకపోవడం అంటే ఎంతనరకం. ఉండీ మాట్లాడలేని దుస్థితిని భరించడం మరింత కష్టం.

ఎప్పుడో పదిరోజులకొకసారి మందు అయి పోయినాయా! అనో, ఆరోగ్యం ఎట్లా ఉందనో! కొడుకు పరామర్శ.

రోజూ డ్యూటీలాగా అన్నం, కూరలు గురించి చెప్పే కోడలు పరామర్శ తప్ప ఇంకేమీ లేని రాజారావు క్షణమొక యుగంలా గడుపుతున్నాడు.

మధ్యాహ్నం భోజనం అయిన తర్వాత టాబ్లెట్లు వేసుకుని ఒక కునుకు తీశాడు.

సాయంత్రం కొడుకు కోడలు వచ్చేసరికి చీకటి పడింది. రాత్రి భోజనాలయాక మళ్లీ టాబ్లెట్లు వేసుకుని పడుకోటానికి సన్నద్ధమయ్యాడు.

అంతలో కొడుకు పలకరించాడు.

"టాబ్లెట్లు సరిగా వేసుకుంటున్నావా నాన్నా!" అని

వేసుకుంటున్నానన్నట్లు తలూపాడు రాజారావు.

"కాస్తంత హుషారుగా ఉండండి. రోగం అదే తగ్గుతుంది" అన్నాడు కొడుకు ధైర్యం చెబుతూ

రొటీన్ జీవితంలో హుషారెక్కడ నుండి వస్తుందను కుంటా పైకి మాత్రం

'అలాగే!' అన్నాడు రాజారావు.

'మనసులో దిగులు పెట్టుకోకండి" అన్నాడు కొడుకు మళ్లీ.

నేనెందుకు దిగులు పడాలి! అందామనుకున్నా నోట మాట పెగిలిరాలేదు.

"సరే!" అన్నాడు ముక్తసరిగా.

"సరే! నిద్రొస్తున్నట్లుంది పడుకోండ"ంటూ వెళ్ళాడు కొడుకు.

కొడుకటు వెళ్ళగానే మళ్ళీ ఆలోచనలు చుట్టు ముట్టినయ్ రాజారావుని... ఒంటరితనం భరించడం తనవల్ల కావడం లేదు. ఈ నిశ్శబ్దంతో యుద్ధం చేయలేక అలసిపోతున్నాడు తను. ఆ దేవుడు కనబడి ఏం కావాలంటే ఈ ఒంటరితనం నుండి విముక్తున్ని చేసి తీసుకుపొమ్మని కోరుకుంటాను" అని మనసులో అనుకుంటూ నిద్రలోకి జారుకున్నాడు రాజారావు.

ఆ ప్రార్థన మన్నించాడేమే దేవుడు. ఆ మర్నాడు రాజారావిక నిద్రలేవలేదు. ■